క్లుప్తంగా

నేడు మండపేటలో గడప గడపకూ..

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పట్టణంలోని 12వ వార్డులో పర్యటించనున్నట్టు పార్టీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

సీసీ రహదారి నిర్మాణ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ పంచాయతీ సమీప వీధిలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఆదివారం గ్రామ సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు పరిశీలించారు. ప్రాధాన్యతా క్రమంలో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు వారు తెలిపారు.

ధనమ్మమర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలోని ధనమ్మతల్లి దైవక్షేత్రమైన ధనమ్మమర్రికి భక్తులు పోటెత్తతారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఉద్యోగ, వ్యాపారులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆడపడుచులు మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి తీరాన ఆహ్లాదకరమైన పచ్చటి వ్యవసాయ క్షేత్రాలను వీక్షిస్తూ సందడి చేశారు. జాతర సందర్భంగా అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

కాజులూరు: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఉభయగోదావరి జిల్లాల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుడుపూడి సూర్యానారాయణరావు విజయోత్సవ ర్యాలీని సంఘ సభ్యులు, పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం విశ్వేశ్వరరావు తదితర నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి కార్యక్రమానికి హాజరు కావలసిందిగా సభ్యులను, పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఆహ్వానించారు. కాజులూరులో ఆయన మాట్లాడుతూ 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అమరావతిలో కుడుపూడి సూర్యనారాయణరావు ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి 16న జిల్లాకు రానున్నారన్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రావులపాలెం మీదుగా అమలాపురం వరకూ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. అందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘం ఉపాధ్యక్షుడు దెయ్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుబ్బాలమ్మ జాతర

రంగంపేట: మండలంలోని సింగంపల్లిలో కొలువైయున్న గుబ్బాలమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా అందరినీ అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎస్ఐ రామకృష్ణ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పర్యావరణహితంగా జీవన శైలి

రాజానగరం: పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా జీవన శైలిని అలవర్చుకోవాలని అటవీ శాఖ డీఆర్వో పద్మావతి అన్నారు. మండలంలోని పాతతుంగపాడు, తోకాడలలో సర్పంచ్‌లు ఎలుగుబంటి రాంబాబు, వేగిశెట్టి వీవీ చక్రధరరావు అధ్యక్షతన ఆదివారం మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ బీట్ అధికారి జీవీ రంగారావు, సహాయ అధికారి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సమావేశాలు

మండపేట: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ కపిలేశ్వరపురం, రాయవరం మండలాల కమిటీ సమావేశాలు ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి మాధవరావు, ముత్యాల వెంకట్రావుల అధ్యక్షతన నిర్వహించారు. ఆయా మండలాల్లోని పార్టీ పరిస్థితిపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమీక్షించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాలపై క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన ఓటర్ సర్వేపై కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

దేశం విశ్వగురువుగా ఖ్యాతికెక్కాలి

ఆలమూరు: దేవుని కృపతో భారతదేశం గొప్ప విశ్వగురువుగా ఖ్యాతికెక్కాలని మండపేటకు చెందిన శ్రీఅమ్మా భగవాన్ భక్తబృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. గుమ్మిలేరులోని రామాలయం వద్ద శనివారం రాత్రి శ్రీఅమ్మా భగవాన్ భక్తబృందం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది.

నూతన ఒరవడి.. పశువిజ్ఞాన బడి

- మండలాల్లో ప్రతి వారం నిర్వహణ
- జూన్ నుంచి ప్రారంభమైన కార్యక్రమం
- పాడి రైతులకు వివిధ అంశాలపై అవగాహన





పశు విజ్ఞాన బడి నిర్వహిస్తున్న పశువైద్యులు

రాయవరం: వ్యవసాయంలో రైతులకు విజ్ఞానాన్ని పెంచేందుకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పొలం బడి తోటబడి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోంది. అదే బాటలో మరో అడుగు ముందుకు వేసి పాడి రైతులకు పాడిసాగుపై మరింత అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఆస్పత్రికి రాని స్థితిలో ఉండే పశువులకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో సంచార పశు వైద్య శాలలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు పాడిపై రైతులకు మరింత అవగాహన పెంచేందుకు ప్రతి వారం 'పశు విజ్ఞాన బడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఏడాదిగా

గతేడాది జూన్ నుంచి పశు విజ్ఞాన బడులను పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి మండలంలో వారం వారం పశు వైద్యులు, సహాయ సంచాలకులు పశు విజ్ఞాన బడులను నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా పాల ఉత్పత్తి పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఎలాంటి పశు గ్రాసాన్ని, పశు దాణాను వాడుకోవాలి. పాల ఉత్పత్తి పెంచుకునేందుకు ఎంత మేర పచ్చిమేత అవసరం, పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి పశు విజ్ఞాన బడుల్లో రైతులకు వివరిస్తున్నారు. పాడి పశువులకు దాణామృత, సమీకృత దాణా ఎలా ఇవ్వాలో కూడా అవగాహన కల్పిస్తారు. పాడి పశువులకు సంబంధించి దూడల మరణాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన సంరక్షణ పద్ధతులు గురించి వివరిస్తున్నారు. కొన్ని ఆవులు, పశువులు ఎదకు రాకుండా, చూలు కట్టకుండా ఉంటాయి. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేస్తారు. శాస్త్రీయంగా గొర్రెలు, మేకలు పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారు. కోళ్ల పెంపకాన్ని ఎలా చేపట్టాలో కూడా అవగాహన కల్పిస్తారు.

రెండు నియోజకవర్గాల్లో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటుగా రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని పశు వైద్యాధికారులు నిర్వహిస్తున్నారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలో 24 పశువైద్యశాలలున్నాయి. ప్రతి వెటర్నరీ డిస్పెన్సరీ పరిధిలో నెలకు నాలుగు పశు విజ్ఞాన బడులు నిర్వహిస్తున్నారు. రైతులకు వివిధ అంశాలపై పశువులకు వచ్చే వ్యాధులు, వ్యాధులకు తీసుకునే చికిత్సలు, పశువులను ఏ విధంగా సాకాలి? వాటికి ఎటువంటి దాణాను అందించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఎంతో ప్రయోజనం



రైతు భరోసా కేంద్రాల పరిధిలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. రైతులకు పాడి పరిశ్రమ అభివృద్ధి, పశువులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన పశు సంరక్షక్ యాప్‌లో వారం వారం ఫొటోలు, హాజరైన రైతుల పేర్లు, వారి ఫోన్ నంబర్లను అప్‌లోడ్ చేయిస్తున్నాం. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

– డాక్టర్ బి.అనితాకుమారి, ఏడీ, మండపేట ఏరియా పశువైద్యశాల, రాయవరం

'చింతపల్లి'కి మంత్రి వేణు పరామర్శ



చింతపల్లి వీరభద్రరావును పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: సతీ వియోగంతో బాధపడుతున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్, రామచంద్రపురం మండల మాజీ ఎంపీపీ చింతపల్లి వీరభద్రరావును రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం పరామర్శించారు. మంత్రి వేణు వెంట సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, కంచుమర్తి బాబూరావు, చింతపల్లి వీరభద్రరావు కుటుంబ సభ్యులు ఈశ్వరరావు, వెంకటరమణ, చిన వెంకటరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993 – 98లో చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమ గురువు పీవీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులకు గురుపూజ చేసి, గురుభక్తిని చాటుకున్నారు. కుటుంబ సభ్యులకు తమ చిన్ననాటి స్నేహితులను పరిచయం చేశారు.

మాతృమూర్తి ఆశీస్సులు అందుకున్న మంత్రి



తల్లి సుభద్రమ్మ ఆశీస్సులు అందుకుంటున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: అంతర్జాతీయ మాతృదినోత్సవం పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తన మాతృమూర్తి సుభద్రమ్మ ఆశీస్సులు అందుకున్నారు.

అమ్మే ఆది గురువు



గొల్లపాలెంలో తల్లులకు పాదపూజ నిర్వహిస్తున్న చిన్నారులు

కాజులూరు: సృష్టిలో ప్రతి జీవికి అమ్మే ఆది గురువు అని గొల్లపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. స్థానిక క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మాతృదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులు తమ తల్లులకు కాళ్లు కడిగి పాదపూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి జీవి తన జీవనాధారమైన ఆహార సేకరణ తల్లి నుంచే నేర్చుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు టి.భార్గవీ రెడ్డి, నల్లమిల్లి విజయలక్ష్మి, నల్లమిల్లి భువన, రుషి, గీతా, శ్లోక, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం



ద్రాక్షారామ పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ అరుణ తదితరులు

రామచంద్రపురం రూరల్: పర్యావరణ పరిరక్షణ సమాజంలో అందరూ పాటించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాదం బాలబ్బాయి అన్నారు. మండలంలోని ద్రాక్షారామలో ఆదివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉప్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాద్ సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణాన్ని కాపాడే విధంగా ప్రజలు తమ జీవన శైలిని మార్చుకోవాలని పలు సూచనలు చేశారు. శక్తి వనరులను, నీటిని పొదుపుగా వాడుకోవడం, ప్లాస్టిక్, ఈ వేస్ట్‌లను నివారించడం, ఆర్గానిక్ ఆహారం, అడవుల పెంపకం తదితర కార్యాచరణతో పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడే విధంగా జీవన శైలి మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పెద్దలు దామిశెట్టి గంగాపురుషోత్తం, మేడిశెట్టి కృష్ణదాస్, వార్డు సభ్యులు సాక్షి పద్మనాభం, కొసనా భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఏఎంసీ ప్రమాణ స్వీకారం

హాజరైన ప్రముఖులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండపేట ఏఎంసీ సభ్యులు. చిత్రంలో ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

మండపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి మండలంలోని ద్వారపూడి టీఎస్ఎం కల్యాణ మండపంలో అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణబాబు, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల డీసీసీబీ చైర్మన్లు ఆకుల వీర్రాజు, చింతకాయల లచ్చాపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, మండపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి తదితరులు హాజరయ్యారు. ప్రముఖులు, పార్టీశ్రేణుల సమక్షంలో ఏఎంసీ చైర్మన్‌గా సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా చిక్కాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్సీ సూర్యనారాయణబాబు, ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు మాట్లాడుతూ పార్టీలో కష్టించి పని చేసే వారికి వైఎస్సార్ సీపీలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని, సిరిపురపు, ఇతర పాలకవర్గ సభ్యుల నియామకమే అందుకు నిదర్శనమన్నారు. రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వారి అభ్యున్నతికి ఏఎంసీ సభ్యులు పని చేయాలని సూచించారు. ఏఎంసీలోను మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మహిళ కమిషన్ చైర్‌పర్సన్ పద్మ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని, ఆయన అడుగుజాడల్లో పాలకవర్గ సభ్యులు పని చేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు, వైస్ చైర్మన్ చిక్కాల, ఇతర పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్సీ తోట, ప్రముఖులు ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్రనేతలు రెడ్డి రాజుబాబు, కొవ్వూరి త్రినాధరెడ్డి, దూలం వెంకన్నబాబు, ఆర్‌వీవీ సత్యనారాయణ చౌదరి, సత్తి వెంకటరెడ్డి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి భవాని, నల్లమిల్లి మంగతాయారు, పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నౌడు వెంకటరమణ, మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ద్వారపూడి వైస్ సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, మండపేట అర్బన్, మండలాల కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, చిన్నం అపర్ణ, శీలం గోవిందు, పార్టీ నాయకులు తులా శ్రీరంగారావు, గారపాటి అశోక్‌కుమార్, తోరం శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్, వల్లూరి రామకృష్ణ, గూడూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టునీడలో..



పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: పామర్రు ఉన్నత పాఠశాలలో 1997–98లో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట ఏకమవడం అంటే ఆషామాషీ కాదు. ఆదివారం అప్పటి విద్యార్థులందరూ ఒకే చోట ఏకమై సంతోషంగా గడిపారు. వారు ఒకరిని ఒకరు పలకరించుకుని సంతోషంగా గడపడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి విరాళాన్ని కూడా అందించారు. ఉదయం నుంచి పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేజీపై విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఫొటోలు తీయించుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను పూలదండలు, శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. అప్పట్లో విద్యను బోధించిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులంతా కలసి ఒకే చోట సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఏటా ఇదే విధంగా పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడానికి ప్రణాళిక వేసుకున్నట్టు తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



రామచంద్రపురంలో సీతారామ భక్తాంజనేయస్వామిని దర్శించుకున్న మంత్రి వేణు

మండపేట: మండపేట పట్టణ, మండల గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వాడవాడల ఆంజనేయ స్వామివారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో వందేళ్ల చరిత్ర కలిగిన స్థానిక ఎస్‌బీఐ వద్ద గల భక్తాంజనేయస్వామి వారి ఆలయంలో అర్చకులు ఖండవిల్లి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు, లక్ష గంధసింధూర తమలపాకుల పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు ప్రకాష్, వైఎస్సార్ సీపీ నేత రెడ్డి రాజుబాబు, టీడీపీ నేత వి సాయికుమార్ తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మన్యం లక్ష్మణరావు కుటుంబ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 5వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గెడా రాము, సభ్యులు రౌతు రాజు, జొన్నల శ్రీనివాస్, నూని హరిబాబు, సంక శ్రీనివాసరంగా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

శ్రీసీతారామక్షేత్రంలో

పట్టణంలోని బురగుంట చెరువు వద్ద ఉన్న సీతారామ క్షేత్రంలోని ధ్యానాంజనేయస్వామి వారి మందిరం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణం, మండల గ్రామాల్లోని ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం బాలభక్త సమాజం ఆధ్వర్యంలో హనుమజ్జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉష్ట్ర వాహనంపై ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో స్వామి వారి ఊరేగింపు మేళతాళాలతో నిర్వహించారు. కార్యక్రమంలో బాలభక్త సమాజం మాజీ అధ్యక్షుడు దామిశెట్టి గంగాపురుషోత్తం, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దామిశెట్టి సత్యనారాయణమూర్తి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని వెల్ల, దాసరిపాడు, గొల్లలచెరువు, నరసాపురపుపేట తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి పరస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణలు చేశారు.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని రాజగోపాల్ సెంటర్ వద్ద వేంచేసిన సీతారామ భక్తాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన హనుమజ్జయంతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి తల్లి గన్నమని భానుమతి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని మంత్రి వేణు ప్రారంభించి భక్తులకు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. గన్నమని చక్రవర్తి ఆధ్వర్యంలో రామచంద్రపురం లారీ యూనియన్ ఆఫీసు వద్ద మరో చలివేంద్రాన్ని డాక్టర్ చెలికాని రామారావు చేతుల మీదుగా ప్రారంభించారు.



ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామి ఊరేగింపు

కపిలేశ్వరపురం: మండలంలోని పెద్ద కోరుమిల్లి, చిన్నకోరుమిల్లి, కపిలేశ్వరపురం, వెదురుమూడి తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి భారీ విగ్రహాలు వద్ద హనుమాన్ జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లోని స్వామి ఆలయాల్లో అభిషేక పూజా కార్యక్రమాలను చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఊడుమూడిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వేదపండితుల బ్రహ్మత్వాన లక్ష తులసి పూజ నిర్వహించారు. అముజూరులోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదానంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కోటిపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్వామికి తులసి, పాలు, గంధంతో అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవాలు

రాయవరం: పవనపుత్రా పాహిమాం..వాయుపుత్రా రక్షమాం.. అంటూ భక్తుల మారుతి నామ స్మరణతో ఆదివారం ఆంజనేయస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. మండలంలోని పలు ఆలయాల్లో భక్తాంజనేయస్వామి జయంత్యుత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. రాయవరంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు కూరెళ్ల సూర్యనారాయణమూర్తి, శివల ఆధ్వర్యంలో నాగవల్లీ దళాలతో అర్చన, రుద్రాభిషేకం, సింధూరపూజ, లక్ష తులసి దళ అర్చన, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. రాయవరం–వెదురుపాక రహదారిలో వి.సావరం సెంటర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. లొల్ల, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు.



మండపేట భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కోటిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద చేస్తున్న అభిషేకాలు



వెదురుపాకలో భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు